క్లుప్తంగా

స్టేషన్‌ను సందర్శించిన ఎన్‌జీఓస్ ప్రతినిధులు


ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్‌ఐ

బండిఆత్మకూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎన్‌జీఓస్ ప్రతినిధులు రఘునాథరెడ్డి, హేమంత్‌రెడ్డి సందర్శించారని బండిఆత్మకూరు ఎస్‌ఐ జగమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు స్టేషన్ పరిసరాలు, స్టేషన్ రికార్డులను పరిశీలించారన్నారు. రికార్డులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఇన్‌చార్జి సీఐ అసరర్‌బాషా వారికి వివరించారన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

మహానంది: వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ప్రజలు సైతం సహకరించాలని డీఆర్‌ఓ హైమావతి తెలిపారు. బుక్కాపురంలో ఆదివారం వన్యప్రాణుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 8వ తేదీ వరకు వన్యప్రాణుల సంరక్షణపై వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జీవావరణ వ్యవస్థలో సమతుల్యత ఉన్నప్పుడే జీవుల మనుగడ సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ కుమార్, ఎఫ్‌బీఓలు ప్రతాప్, శ్రీనివాసులు, రిటైర్డ్ వీఆర్‌ఓ పాములేటి తదితరులు పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలి

మహానంది: తపాలా శాఖలో గ్రామీణ్ డాక్ సేవక్స్ (జీడీఎస్)లకు తీవ్రమైన పని ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం సర్కిల్ కార్యదర్శి మల్రెడ్డి అన్నారు. మహానందిలో ఆదివారం తపాల ఉద్యోగుల 5వ వార్షిక సమావేశం నిర్వహించారు. కర్మయోగి, ఆన్‌లైన్ కోర్సులు చేయమని ఒత్తిడికి గురి చేయడం సరి కాదన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సెక్రటరీ జమాల్‌బాషా, నాయకులు మీరావలి, శైలజ, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

తరిగోపుల వాసికి డాక్టరేట్


రాజకుమార్

జూపాడుబంగ్లా: మండలంలోని తరిగోపుల గ్రామానికి చెందిన కాటిపోగు రాజకుమార్‌కు శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. యూనివర్సిటీ ప్రొఫెసర్ ఉమామహేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో డిజైన్ అండ్ మోడలింగ్ ఫర్ హై స్పీడ్ వీఎల్ఎస్ ఐ సర్క్యూట్ యూజింగ్ త్రూ సిలికాన్ వయాస్ అనే అంశంపై పరిశోధన చేసి నివేదికలను అందజేశారు. దీంతో ఎస్‌వీ యూనివర్సిటీ వారు అతనికి డాక్టరేట్‌ను ప్రకటించారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం


కేవీపీఎస్ జెండాను ఎగురవేస్తున్న గంధం ఉసేనమ్మ

పగిడ్యాల: ఐక్య పోరాటాలతోనే ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని కేవీపీఎస్ జిల్లా నాయకురాలు గంధం ఉసేనమ్మ వెల్లడించారు. ఆదివారం స్థానిక దేవనగర్ కాలనీలో కేవీపీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమాజంలో కుల నిర్మూలన కోసం కేవీపీఎస్ ఆవిర్భవించిందని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కును కల్పించిందని అయితే సమాజంలో అసమానతలు ఇంకా తొలగిపోకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో డప్పు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన


మహానందిలో కళాకారుల ప్రదర్శన

మహానంది: దసరా ఉత్సవాల్లో భాగంగా మహానందిలో ఆదివారం రాత్రి బెంగళూరుకు చెందిన ప్రశాంతి నాట్య కళాక్షేత్రం కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు భక్తులను అలరించాయి. శ్రీకూష్మాండ దుర్గ అమ్మవారి ఎదుట కళాకారులు నృత్యాలు ప్రదర్శిస్తూ భక్తిశ్రద్ధలను చాటుకున్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

ఆత్మకూరు: గ్రామీణ ప్రాంతాల రహదారులకు ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కరివేన గ్రామంలో రూ.2.20 కోట్లతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లకు ఆదివారం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. శ్రీశైలం నియోజకవర్గంలో రూ.20 కోట్లతో అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లను ఏర్పాటు చేస్తామన్నారు. మంచినీరు, వీధి దీపాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కరివేన సర్పంచ్ మాణిక్యమ్మ, శివప్రసాద్‌రెడ్డి, దినకర్, రవినాయక్ పాల్గొన్నారు.

‘ప్రయోజనం’ ఏదీ?

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మల్టీపర్పస్ గోడౌన్ల నిర్మాణం
- అప్పుడే ప్రారంభించిన గత ప్రభుత్వం
- నెలలు గడుస్తున్నా ఉపయోగంలోకి తీసుకురాని కొత్త ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న రైతన్నలు
- ఎప్పుడు ప్రారంభిస్తారో అని వేచి చూస్తున్న కర్షకులు


ఉపయోగంలో లేని గోకవరం మల్టీపర్పస్ గోడౌన్

కొత్తపల్లి: టీడీపీ ప్రభుత్వం రైతుల సమస్యలను గాలికి వదిలేసిందనడంలో అతిశయోక్తి లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించి ప్రారంభించిన బహుళ ప్రయోజన గోదాములను కొత్త ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు పూర్తి కావస్తున్న ఉపయోగంలోని తీసుకురాకపోవడంతో రైతన్నలు ఖరీఫ్ సీజన్‌లో పండించిన పంటలను ఎక్కడ నిల్వచేసుకోవాలన్న సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఖరీఫ్ సీజన్ పూర్తి కావస్తోంది. ఇందులో ఆరుతడి పంటలు కోతలను రైతులు మొదలు పెట్టారు. ఇంకా వర్షాలు పడుతుండంతో రైతన్నల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికైనా టీడీపీ ప్రభుత్వం గోడౌన్లను ఉపయోగంలోకి తీసుకురావాలని అన్నదాతలు కోరుతున్నారు.

9 గ్రామ పంచాయతీల్లో నిర్మాణం..

మండల పరిధిలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రైతులు ధాన్యం భద్ర పరుచుకునేందుకు ప్రత్యేకంగా నాబార్డు నిధులతో 12 గ్రామ పంచాయతీలకు గాను 9 గ్రామ పంచాయతీలలో గోడౌన్లను మంజూరు చేసింది. వెయ్యి మెట్రిక్‌టన్నుల సామర్థ్యం ఉన్న ధాన్యాన్ని రైతులు నిలువ చేసుకునేందుకు రూ.75 లక్షలతో గువ్వలకుంట్ల, దుద్యాల, గోకవరం గ్రామపంచాయతీలలో గోడౌన్లను నిర్మించారు. వీటితో పాటు 500 మెట్రిక్‌టన్నుల సామర్థ్యం ఉన్న ధాన్యాన్ని నిల్వ చేసుకొనేందుకు రూ.40 లక్షల నిధులతో కొత్తపల్లి, కొక్కెరంచ, ఎదురుపాడు, గుమ్మడాపురం, శివపురం, ఎర్రమఠం గ్రామపంచాయతీలలో గోడౌన్ల నిర్మాణాలను చేపట్టారు. గోడౌన్ల నిర్మాణానికి మొత్తం రూ.4.65 కోట్లు ఖర్చుచేశారు.

గత ప్రభుత్వ హయాంలో ప్రారంభం

గత ప్రభుత్వ హయాంలో అప్పటి నాగంపల్లి సొసైటీ చైర్మన్ గౌరు జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో శాప్‌చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, సొసైటీ అధికారులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా గౌడన్లను ప్రారంభించారు. తర్వాత 2024 సార్వత్రిక ఎన్నికలు రావడం, ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చింది. ఆ తరువాత గౌడన్లను ఉపయోగంలోకి తీసుకురాలేదు.

రైతులు ధాన్యం నిల్వ చేసుకోవచ్చు



ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంట కోతలు చేసుకొన్న తర్వాత ధాన్యాన్ని గోడౌన్లలో నిల్వ చేసుకోవచ్చు. ఇంతవరకు ఏ రైతు కూడా ధాన్యం నిల్వచేసుకొనేందుకు ముందుకు రాలేదు. రైతులు గోడౌన్లను సద్వినియోగం చేసుకోవచ్చు. వ్యాపార నిమిత్తం, రైతులు పండించిన ధాన్యాన్ని వీటిలో నిల్వచేసుకోవచ్చు. గత ప్రభుత్వ హయాంలోనే వాటిని ప్రారంభించాం. వాటని ఏ రైతైనా వినియోగించుకోవచ్చు.

– కోటేశ్వరయ్య, సీఈఓ, నాగంపల్లి సొసైటీ, కొత్తపల్లి

ఉపయోగంలో ఉంటే ఎంతో బాగుండేది



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రారంభించిన మల్టిపర్పస్ గోడౌన్లను ప్రభుత్వం ఉపయోగంలోకి తీసుకువచ్చింటే ఎంతో బాగుండేది. గోడౌన్లను తెరిస్తే వాటిలో మేము పండించిన మొక్కజొన్న ధాన్యాన్ని నిల్వచేసుకునే వాళ్లం. వానలు ఇంకా పడుతునే ఉన్నాయి. వర్షం వచ్చిన ప్రతిసారి ధాన్యం ఎక్కడ భద్ర పరుచుకోవాలో అర్థం కావడంలేదు. ధాన్యం తడిపోతుందని భయం వేస్తుంది. ప్రభుత్వం వెంటనే గోడౌన్లను వినియోగంలోని తీసుకురావాలి

– జి.సలీం, రైతు, శివపురం.

గోడౌన్లు వినియోగంలోకి తీసుకురావాలి



మా గ్రామంలో రైతులందరం ఖరీఫ్ సీజన్‌కు వరి సాగుచేసుకున్నాం. ఇప్పుడు పంటలు కంకి విడుస్తున్నాయి. మరో నెల రోజుల్లో వరి కోతలు ప్రారంభం అవుతాయి. పండించిన ధాన్యాన్ని నిలువ చేసుకునేందకు ఇళ్లు చాల చిన్నగా ఉన్నాయి.. కాబట్టి నిల్వ చేసుకోలేము. అదే గోడౌన్లు వినియోగంలో ఉండింటే పండించిన ధాన్యాన్ని వాటిలో నిల్వ చేసుకునేందకు అనుకులంగా ఉండేది. ప్రభుత్వం వాటిని ఎంత త్వరగా వినియోగంలోకి తేస్తే అంత బాగుంటుంది.

– చంద్రబాబు, రైతు, గువ్వలకుంట్ల.

మొక్కజొన్న రైతులకు న్యాయం చేయాలి


మొక్కజొన్నను చూపిస్తున్న రైతులు

మహానంది: వ్యాపారులంతా ఒక్కటై రైతులను మోసం చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు తెలిపారు. ఆదివారం తమ్మడపల్లె గ్రామంలో మొక్కజొన్న రైతులతో మాట్లాడారు. క్వింటా రూ. 2,950 ఉండేదని, అయితే దళారుల కారణంగా ఉన్నట్లుండి రూ. 2350 చేయడం బాధాకరమన్నారు. ఈ నెల 7న రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

జూపాడుబంగ్లా: ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని సీపీఐ నాయకుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన జూపాడుబంగ్లాలో విలేకరులతో మాట్లాడుతూ అకాల వర్షాలతో పాములపాడు, జూపాడుబంగ్లా, మిడ్తూరు, నందికొట్కూరు, పగిడ్యాల మండలాల్లోని చేతికొచ్చిన మొక్కజొన్న ధాన్యం తడిసిపోయిందన్నారు. దీంతో వ్యాపారులు ధర తగ్గించి అడుతుండటంతో రైతులు భారీగా నష్టపోతున్నారన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న క్వింటా రూ.3,300ల మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కోరారు.

వృత్తి విద్య కోర్సులపై అవగాహన


నర్సింగ్ కోర్సుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ షకీరా

నందికొట్కూరు: దసరా సెలవుల్లో విద్యార్థులు వృత్తి విద్య కోర్సులపై అవగాహన పెంచుకోవాలని కొణిదేల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రామచంద్రమూర్తి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొణిదేల గ్రామ జెడ్పీ హైస్కూల్‌లో సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటర్న్ షిప్ శిక్షణలో భాగంగా విద్యార్థులకు వృత్తి విద్య కోర్సులపై ఒకేషనల్ ట్రైనర్ షకీరా అవగాహన కల్పించారు. హెచ్ఎం మాట్లాడుతూ హెల్త్‌కు సంబంధించిన కోర్సులైన నర్సింగ్, ల్యాబ్ టెక్నిషియన్, మెడికల్ స్టోర్స్, ఎలక్ట్రికల్ శాఖ టైలరింగ్‌తో పాటు ఇతర వృత్తి విద్య కోర్సులపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవప్రకాష్, నారాయణరెడ్డి, రఫి, అహ్మద్, సిల్వియా, రేచల్, ఫిజికల్ డైరెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

10 వేల క్యూసెక్కుల నీటి విడుదల

పాములపాడు: మండలంలోని బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి ఆదివారం 10 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు జేఈ దేవేంద్ర తెలిపారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు నుంచి 10 వేల క్యూసెక్కుల నీరు ఎస్ఆర్ఎంసీ ద్వారా బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరుకు వచ్చి చేరుతుందన్నారు. ఈ నీటిని తెలుగుగంగ(వీబీఆర్)కు 5000 క్యూసెక్కులు, కేసీసీ ఎస్కేప్ ఛానల్‌కు 1000 క్యూసెక్కులు, జీఎన్ఎస్ఎస్ కు 4000 క్యూసెక్కుల చొప్పున నీటి విడుదల కొనసాగిస్తున్నట్లు వివరించారు.

వాల్మీకీ రిజర్వేషన్ల హామీని నెరవేర్చాలి

శ్రీశైలంప్రాజెక్ట్: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో వాల్మీకి, బోయలకు రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ వాల్మీకిబోయ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నల్లబోతుల మల్లికార్జున డిమాండ్ చేశారు. వీలైనంత త్వరగా తమను ఎస్టీ జాబితాలో చేర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

ఉద్యోగం పోతుందనే బెంగతోనే ప్రమాదం

- సేల్స్‌మెన్ నరేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- వైఎస్సార్‌సీపీ, సీపీఐ నాయకుల డిమాండ్


నరేష్

జూపాడుబంగ్లా: రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన మద్యం పాలసీతో అబ్కారీ శాఖలో ఉన్న సేల్స్‌మెన్ ఉద్యోగం పోతుందన్న బెంగతో జూపాడుబంగ్లాకు చెందిన నరేష్(32) రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయాడని, అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, సర్పంచ్, వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల కన్వీనర్ నాగార్జునరెడ్డి, కోసిక తరుణ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. బైక్‌పై నుంచి కింద పడి మృతి చెందిన ప్రభుత్వ మద్యం దుకాణం సేల్స్‌మెన్ కాసపోగు నరేష్(32) కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, సర్పంచ్, వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల కన్వీనర్ నాగార్జునరెడ్డి, కోసిక తరుణ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. పి.లింగాపురం గ్రామానికి చెందిన కాసపోగు నరేష్ 8 మాసాల నుంచి జూపాడు బంగ్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 1న విధులకు హాజరైన అతను టీడీపీ ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రైవేటీకరణ చేయడంతో పాటు దుకాణాల్లో పనిచేసే వారిని తొలగిస్తున్నామని ప్రకటించింది. దీంతో మానసిక ఒత్తిడికి గురై బైక్‌పై గ్రామానికి బైక్ వెళ్తా కింద పడటంతో తలకు గాయమై, ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివా రం మృతిచెందాడు. ఇతనికి భార్య యశోద, ఆరు, మూడేళ్ల వయస్సున్న ఇరువురు బాలికలు ఉన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయ కులు, సీపీఐ నాయకుడు రమేష్‌బాబు మాట్లాడు తూ.. నరేష్ మృతికి కారణం టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యధోరణి కారణమన్నారు. నరేష్ మృతికి ప్రభుత్వం బాధ్యత వహించి అతని కుటుంబానికి రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించటంతో పాటు భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

యథేచ్ఛగా ఇంజిన్ బోటు ప్రయాణం


అర్లపాడు ఘాట్ నుంచి చెల్లపాడుకు వెళ్లేందుకు బోటులో ప్రయాణికులను ఎక్కిస్తున్న దృశ్యం

పగిడ్యాల: కృష్ణానది బ్యాక్‌వాటర్‌లో ఇంజిన్ బోటు ప్రయాణాలపై నిషేధం ఉన్నప్పటికీ అధికార పార్టీ నాయకులు అండదండలతో అర్లపాడు ఘాట్ బోటు నిర్వాహకులు యథేచ్ఛగా ఇంజిన్ బోటు ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఎగువ నుంచి కృష్ణానదికి వరద జలాలు వచ్చి చేరడంతో రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకుంది. దీంతో బ్యాక్‌వాటర్‌లో ఇంజిన్ బోటు ప్రయాణాలు చేయరాదని పోలీసులు బోటు నిర్వాహకులకు మౌఖికమైన ఆదేశాలు జారీ చేశారు. అయినా అర్లపాడు ఘాట్ బోటు నిర్వాహకులు ఇంజిన్ బోటు ద్వారా తెలంగాణ రాష్ట్రం చెల్లపాడు ఘాట్‌కు ప్రయాణికులను తరలిస్తూ.. వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇప్పటికే రెండు పర్యాయాలు బోటు నిర్వాహకులపై ముచ్చుమర్రి పోలీసులు హెచ్చరికలు జారీ చేసి బైండోవర్ కేసులు నమోదు చేశారు. అయినా ధనార్జనకు అలువాటుపడిన ఘాట్ నిర్వాహకులు అధికార పార్టీ నాయకుల అండదండలతో ఇంజిన్ బోటును యథేచ్ఛగా నడుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు.


కళాకారుల నృత్య ప్రదర్శన


శ్రీశైల ఆలయంలో ఆకట్టుకుంటున్న స్వామివారి పుష్పాలంకరణ

రైతులకు రాయితీపై శనగ విత్తనాలు


రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

జూపాడుబంగ్లా: రైతులకు రాయితీపై ఇస్తున్న శనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండ్లెం సర్పంచ్ పుట్టల కృపమ్మ తెలిపారు. మండలంలోని మండ్లెం రైతు సేవా కేంద్రంలో ఆదివారం రాయితీ శనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ జేజీ11 రకం శనగ విత్తనాలను క్వింటా పూర్తి ధర రూ.9,400లు కాగా 25శాతం రాయితీ 2,350లు పోను రైతులకు రూ.7,050లకు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, కార్యదర్శులు సుబ్బారెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ధైర్యంగా దరఖాస్తు చేసుకోండి


మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ కిశోర్ కుమార్

పాములపాడు: ఆశావహులు ఎవరికీ భయపడకుండా ధైర్యంగా మద్య దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ ప్రొహిబిషన్ సీఐ కిశోర్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. పాములపాడు మండలానికి జనాభా ప్రకారం ఒక దుకాణం కేటాయించినట్లు చెప్పారు. ఆన్‌లైన్, హైబ్రీడ్, ఆఫ్ లైన్ పద్ధతుల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసే సమయంలో ఆధార్ కార్డు, పాసు ఫొటో ఉండేలా చూసుకోవాలన్నారు. " District prohibition and Excise Officer, Nandyal" వారి పేరుతో రూ.2 లక్షలు డీడీ తీసుకోవాలని చెప్పారు. ఒక వ్యక్తి ఎన్నిదుకాణాలకైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏదైనా సమస్య ఉంటే ఆత్మకూరు కార్యాలయం వద్ద సంప్రదించాలని, అక్కడే ఏర్పాటు చేసిన కౌంటర్లలో దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోండి

కొత్తపల్లి: 2024 నుంచి 2026 వరకు మద్యం షాపు నిర్వహణకు ఆసక్తి ఉన్న ఎవరైనా దరఖాస్తులు చేసుకోవాలని ఎక్సైజ్ ఎస్ఐలు జగదీష్, వీరస్వామి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మండలంలో ఒక్క మద్యం దుకాణానికి మాత్రమే అనుమతి ఉందని, 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

దేవీ వైభవం


కైలాస వాహనంపై ఆశీనులైన స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు, ఈఓ





శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృక కార్యక్రమాలు, పుష్పాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. –శ్రీశైలంటెంపుల్


కళాకారుల ప్రదర్శనలు

జగన్మాతా.. నమోస్తుతే

కొత్తపల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 4వ రోజు ఆదివారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ దేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కొలను భారతి ఆలయంలో అమ్మవారిని పూలమాలలు, నిమ్మకాయల దండలతో అలంకరించి కుంకుమార్చన, పుష్పార్చన, మహామంగళహారతి, తీర్థ ప్రసాదాలతో విశేష పూజలు నిర్వహించారు. భక్తులు సుదూర ప్రాంతాల నుంచి చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. అదేవిధంగా సంగమేశ్వరంలో లలితా దేవీ అమ్మవారు కుష్మాండ దుర్గా దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

పాములపాడు: స్థానిక చౌడేశ్వరీ మాతా ఆలయంలో అమ్మవారు శ్రీ లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. 0అమ్మవారికి గణపతి పూజ, కుంకుమార్చన, సహస్రనామావళి, పంచామృతాభిషేకాలతో పూజలుచేశారు.

మిడుతూరు: స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శ్రీ చౌడేశ్వరీ దేవాలయంలో అమ్మవార్లను లలితా దేవీగా అలంకరించారు. కన్యకాపరమేశ్వరీ దేవీ ఆలయంలో సాయంత్రం అనంత పద్మనాభస్వామి వేషధారణ, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

నందికొట్కూరు: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వర ఆలయంలో శ్రీ లలిత త్రిపురసుందరి దేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. పట్టణంలోని ఆర్య వైశ్యులందరూ వాసవీ కన్యకా పరమేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు శ్రీవీరభద్రస్వామి, జూపాడుబంగ్లా శ్రీసుంకులాపరమేశ్వరీదేవి ఆలయాల్లో అమ్మవారు శ్రీలలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. జూపాడుబంగ్లా క్వార్టర్స్‌లోని సరస్వతీమాత ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణమాతగా భక్తులకు దర్శనమిచ్చారు.


జూపాడుబంగ్లాలో దేవతల వేషధారణలో చిన్నారులు

బండిఆత్మకూరు: స్థానిక ఓంకారేశ్వరాలయంలో ఆదివారం ఉమాదేవి అమ్మవారు మీనాక్షిదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలతో పూజలు నిర్వహించారు.


మహాలక్ష్మీ దేవీ అలంకరణలో కొలనుభారతీ దేవి


పాములపాడులో లలితాదేవిగా చౌడేశ్వరి


బండిఆత్మకూరు: మీనాక్షిదేవిగా ఓంకారం ఉమాదేవి


ఆత్మకూరు: లలితాదేవిగా పూజలు

–ఆత్మకూరు: పట్టణంలో వెలిసిన వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు లలితాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అలాగే చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారికి హోమాలు, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. లలితాదేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు. పట్టణంలోని అంబాభవానీ, కాళికాదేవి, గమ్మిలా పరమేశ్వరి, సుంకులమ్మ, శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

వెలుగోడు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా పూజలందుకున్నారు. వేల్పనూరులో అంకాల పరమేశ్వరిదేవి కూష్మాండ దేవి అలంకరణలో అభయమిచ్చారు.